
సాక్షి
గుంటూరు
ఆదివారం । 2 । మార్చి । 2025



నేతి వెంకన్న స్వామికి నీరాజనాలు

రాజుపాలెం: దేవరంపాడు కొండపై స్వయం భువుగా వెలసిన నేతి వెంకన్న స్వామి మొదటి శనివారం తిరునాళ్లకు భక్తులు పోటెత్తారు. నెయ్యి, బెల్లం, బియ్యం సమర్పించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురి సౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 529.20 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడికాలువకు 6,006 క్యూసెక్కులు విడుదలవుతోంది.

గ్రంథం ఆవిష్కరణ



పొన్నూరు: పట్టణంలోని లుంబినీ వనం అంబేడ్కర్ రీసెర్చ్ సెంటర్‌లో శనివారం కవి డాక్టర్ కత్తి పద్మారావు రచించిన 'సావిత్రి బాయి పూలే 92వ గ్రంథాన్ని ఆవిష్కరించారు.



న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

పట్నంబజారు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గుంటూరు జిల్లాకు పలువురిని పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులుగా నియమిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ మేరకు శనివారం కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనారిటీ విభాగం జిల్లా అధ్యక్షుడిగా గుంటూరు తూర్పు నియోజకవర్గానికి చెందిన వాసిమళ్ల విజయ్‌కుమార్, విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా చిన్నాబత్తిన వినోద్ కుమార్, పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడిగా తాడికొండ నియోజకవర్గానికి చెందిన దాసరి రాజు, గ్రీవెన్స్ విభాగం అధ్యక్షుడిగా రేపూడి రంజన్‌బాబు, ఆర్టీఐ విభాగం అధ్యక్షుడిగా గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి చెందిన కోటా చిన్నపరెడ్డి, దివ్యాంగుల విభాగం అధ్యక్షుడిగా మంగళగిరి నియోజకవర్గానికి చెందిన బొక్కా అగస్టీన్, డాక్టర్స్ విభాగం జిల్లా అధ్యక్షుడిగా గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి చెందిన డాక్టర్ చదలవాడ రవీంద్రనాథ్‌లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

భక్తిశ్రద్ధలతో పుష్ప శయనోత్సవం



పెదకాకాని: స్థానిక శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం భక్తిశ్రద్ధలతో పుష్ప శయనోత్సవాన్ని నిర్వహించారు. మహాశివరాత్రి వేడుకల్లో భాగంగా చివరి రోజు అమ్మవారు పుష్పశయ్యా అలంకరణలో దర్శనమిచ్చారు. ఉదయం సుప్రభాతసేవ, హారతులతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, మహా నివేదన, పంచహారతులు, ద్వాదశ ప్రదక్షిణాలు, ఫల ప్రదానం, పవళింపు సేవను అర్చకులు, వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. శివరాత్రి వేడుకలు ముగిసినట్లు ఆలయ డెప్యూటీ కమిషనర్ గోగినేని లీలాకుమార్ పేర్కొన్నారు. ఉత్సవాలు విజయవంతం కావడానికి సహకారాలు అందించిన ప్రభుత్వ శాఖల అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద పటిష్ట బందోబస్తు



నగరంపాలెం : ఉమ్మడి కృష్ణా –గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించి ఏర్పాట్లను శనివారం రాత్రి జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ పరిశీలించారు. కళాశాల ఆవరణలోని పలు విభాగాలు సందర్శించారు. ఓట్ల లెక్కింపు కేంద్రానికి వచ్చే సిబ్బంది, ఆయా పార్టీ అభ్యర్థులు, ఏజెంట్లను నిశితంగా పరిశీలించి అనుమతించాలని సూచించారు. స్ట్రాంగ్ రూములో భద్రపరిచిన బ్యాలెట్ బాక్సులను లెక్కింపు కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. ఓట్ల లెక్కింపు కేంద్రం భద్రతా ఏర్పాట్లకు తగినంత పోలీసు అధికారులు, సిబ్బందిని బందోబస్తుకు నియమించినట్లు ఎస్పీ సతీష్‌కుమార్ వెల్లడించారు. లెక్కింపు సిబ్బంది, ఏజెంట్లు ద్విచక్ర వాహనాలను ఏసీ కళాశాల ఎదురు రాష్ట్ర గ్రంథాలయం, బౌద్ధ మ్యూజియంలో నిలుపుదల చేయాలని సూచించారు. ఎన్నికల్లో పోటీ చేసిన పార్టీ అభ్యర్థులు తమ వాహనాలను ఏసీ న్యాయ కళాశాలలో పార్కింగ్ చేసుకోవాలన్నారు. పోలీసు శాఖ వాహనాలను సీబీడీ కార్యాలయం ఎదురు ఉన్న ఖాళీ స్థలంలో పార్కింగ్ చేయాలని ఎస్పీ సూచించారు. జిల్లా ఏఎస్పీ హనుమంత్, తూర్పు డీఎస్పీ అబ్దుల్ అజీజ్, ఏఆర్ డీఎస్పీ ఏడుకొండలు రెడ్డి, తహసీల్దార్లు, సీఐలు పాల్గొన్నారు.

యంత్రంతో తంత్రం

- ఎఫ్‌సీ జారీలను ప్రైవేట్ వ్యవస్థకు అప్పజెప్పిన కేంద్ర ప్రభుత్వం
- జర్మనీ మిషనరీతో ఇక్కడ వాహనాల చెకింగ్
- ప్రైవేట్ సంస్థకు ప్రతి వాహనం చెకింగ్‌లో 50 శాతం వాటా ?
- అడ్డగోలుగా వాహనాలను రిజెక్ట్ చేస్తున్న సంస్థ నిర్వాహకులు
- అనుమతులు లేకుండా స్లాట్ల బుకింగ్
- ఎఫ్‌సీ టెస్టింగ్‌లో ఫెయిల్ అయితే మళ్లీ చలానా చెల్లించాల్సిందే !
- ఇబ్బంది పడుతున్న ఆటో, కారు, లారీ వాహనదారులు
- ప్రైవేట్ విధానాన్ని వ్యతిరేకిస్తున్న కార్మిక సంఘాలు

ఫిట్‌నెస్ సర్టిఫికెట్ (ఎఫ్‌సీ) జారీలో ఓ ప్రైవేటు సంస్థ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోంది. వాహనాలను జర్మనీ మిషనరితో తనిఖీలు చేస్తూ నిష్కారణంగా రిజక్ట్ అని చెబుతోంది. ఇదేమని అడిగితే మళ్లీ చలానా కట్టుకోవాల్సిందేనని సిబ్బంది అడ్డగోలుగా సమాధానమిస్తున్నారు. ఇటీవల ఎఫ్‌సీ జారీ చేసే ప్రక్రియ విధానాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రైవేట్ సంస్థకు అప్పజెప్పిన నేపథ్యంలో ఆటో, ట్యాక్సీ, మ్యాక్సీ క్యాబ్, లారీ డ్రైవర్లు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. నెల రోజుల వ్యవధిలోనే పూర్తిస్థాయిలో వ్యతిరేకతలు వ్యక్తమవుతున్నాయి. కార్మికుల నుంచి ఫిర్యాదులు అందుతున్నా, ఆర్టీవో శాఖ అధికారులు కనీసం తనిఖీలు కూడా చేయకుండా మొద్దు నిద్రపోతున్నారు.

పట్నంబజారు: కేంద్ర ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలు రవాణా రంగ కార్మికులకు కష్టాలు తెచ్చిపెడుతున్నాయి. గతంలో ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల జారీ రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ (ఆర్టీఏ) అధికారుల పర్యవేక్షణలో ఉండేది. ఎఫ్‌సీ వ్యవస్థను ప్రైవేట్ పరం చేస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో ఏటుకూరు సమీపంలో ప్రైవేట్ సంస్థను రాయల్ ఏజెన్సీ పేరుతో ఆటోమేటిక్ వెహికల్ ఫిట్‌నెస్ టెస్టింగ్ అండ్ సర్టిఫికేషన్ సెంటర్ (ఏవిఎఫ్‌టీసీ) వ్యవస్థను ఫిబ్రవరి 7న ప్రారంభించారు. అప్పటి నుంచి వ్యవస్థ నిర్వాహకులు తీరుపై పలు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కేంద్ర ప్రభుత్వంలో భాగమైన మోర్త్ మినిస్టరీ ఆఫ్ రోడ్ అండ్ ట్రాన్స్‌పోర్ట్ నుంచి ఏజెన్సీ నిర్వాహకులు అనుమతులు తెచ్చారు. ప్రతి వాహన తనిఖీకి సంబంధించి తీసుకునే చలనాలో 50శాతం వారికి అందుతుంది.

రోజుకు 30పైగా వాహనాలు రిజక్ట్

నూతనంగా ఏర్పాటైన రాయల్ ఏజెన్సీకి సంబంధించి వాహనాల ఫిటెనెస్‌ను తనిఖీ చేసే మిషనరీ అంతా జర్మనీ టెక్నాలజీతో ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు చెబుతున్నారు. రోజుకు 60 నుంచి 70 వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఇందులో కచ్చితంగా 30పైగా రిజక్ట్ అవుతున్నాయని డ్రైవర్లు చెబుతున్నారు. ఫిట్‌నెస్ కాలపరిమితి దాటితే రోజుకు ఆటోకు రూ 20, క్యాబ్, లారీ రూ 50 చొప్పున ఫైన్ పడుతోందని వాపోతున్నారు. గత వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో జరిమానాలు విధించి లేదని చెబుతున్నారు. రాష్ట్రంలో ఒక్క విశాఖపట్నంలోనే ప్రభుత్వం ఆధ్వర్యంలో కొనసాగుతోంది. అదే మాదిరిగా అన్ని ప్రాంతాల్లో నిర్వహించాలని కార్మిక సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు.

మెషీన్ పేరుతో మాయ !



వాహనాలను టెస్టింగ్ చేస్తున్న ప్రైవేట్ కార్మికులు



వాహనాలు తనిఖీ చేసే పరికరాలు ఇవే



ఎఫ్‌సీ జారీ చేసే ప్రైవేట్ సంస్థ రాయల్ ఏజెన్సీ కార్యాలయం

చలానాల్లోనూ దోపిడీ

- ఆటోమేటిక్ వెహికల్ ఫిట్‌నెస్ టెస్టింగ్ అండ్ సర్టిఫికేషన్ సెంటర్ (ఏవిఎఫ్‌టీసీ) ప్రకారం వాహనాలకు చలానాలను నిర్ణయించారు.
- లైట్ మోటార్ వెహికల్ (ఆటో, మూడు చక్రాల వాహనాలు, టాటా ఏసీలు, అప్పి) రూ. 600 ఫీజు, సర్టిఫికెట్ కోసం రూ. 200, జీఎస్టీ రూ. 144, యూజర్ ఫీజు రూ. 120 మొత్తం కలుపుకుని రూ. 1064 చలనా పడుతోంది. దానిలో సంస్థ నిర్వాహకులకు 50శాతం అంటే రూ. 532 వస్తుంది.
- లారీ, ఇతర భారీ వాహనాలకు రూ. 1000 ఫీజు, జీఎస్టీ రూ. 216తో పాటు మిగతా సర్టిఫికెట్, యూజర్ చార్జీలు యథావిధిగా పడుతున్నాయి.
- దీంతో పాటు వాహనం బయటకు వచ్చే సమయంలో సైతం అక్కడి కార్మికులకు రూ. 200 నుంచి రూ. 400 వరకు చెల్లించాల్సి వస్తోందని ఆరోపణలు ఉన్నాయి. స్లాట్ ఉదయం సమయంలో బుక్ చేసుకున్నప్పటికీ సాయంత్రం వరకు పడిగాపులు కాయాల్సి వస్తోందని డ్రైవర్లు వాపోతున్నారు.

స్లాట్ బుకింగ్‌కు అక్రమ వసూళ్లు

పెద్దగా విద్యలేని డ్రైవర్‌ల నుంచి ఏజెన్సీ నిర్వాహకులు దోపిడీ చేస్తున్నారు. స్లాట్ బుక్ చేసేందుకు అనుమతులు లేకపోయినప్పటికీ, కార్యాలయం బయటే సర్టిఫికెట్లు జారీ చేసే కేంద్రంలో రూ. 400 నుంచి రూ. 500 వసూలు చేస్తున్నారు. ఎందుకనే ప్రశ్నిస్తే.. గతంలో ఆర్టీఏ కార్యాలయంలో ఇచ్చే వారు కదా.. ఇప్పుడు ఇవ్వండని సిబ్బంది అడ్డగోలుగా మాట్లాడుతున్నారు. ప్రైవేట్ విధానాన్ని తీసివేసి, తిరిగి ప్రభుత్వమే ఎఫ్‌సీలను జారీ చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

కార్మికుల కడుపు కొడుతున్నారు



ఎఫ్‌సీల జారీ ప్రక్రియను ప్రైవేట్ వ్యవస్థలకు అప్పజెప్పి కార్మికుల కడుపు కొడుతున్నారు. చిన్న చిన్న కారణాలతో ఉద్దేశపూర్వకంగా రిజెక్ట్ చేస్తున్నారు. ఇదే విధంగా వ్యవహరిస్తే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుంది.

– శేషగిరి పవన్‌కుమార్ (వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు)

ప్రైవేట్ పరం చేయడం అన్యాయం



వెహికల్ ఫిట్‌నెస్ ప్రక్రియను ప్రైవేట్ పరం చేయడం దారుణం. గత ప్రభుత్వ హయాంలో కొనసాగిన ప్రక్రియ ఇప్పుడు ప్రైవేట్ సంస్థలకు అప్పజెప్పడం ద్వారా కార్మికులను దోచుకోవడమే అవుతుంది. దీనిపై ఇప్పటికే అధికారులను కలిసి ఫిర్యాదు చేశాం. స్పందించకపోతే పోరాటానికి వెనుకాడం.

– ఆకేటి అరుణ్ (ఆటో డ్రైవర్స్, అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి)

మిషనరీ ద్వారానే ప్రక్రియ



ఎఫ్‌సీల ప్రక్రియ పూర్తిగా మిషనరీల ద్వారానే జరుగుతుంది. మ్యానువల్‌గా చేయం. మిషన్ రిజక్ట్ చేస్తే.. మరోమారు చలానాలు కట్టుకుని రావాల్సిందే. స్లాట్ బుకింగ్ విషయంలో అక్రమ వసూళ్లపై మా సిబ్బందితో మాట్లాడతాం. వాహనదారులు కచ్చితంగా అన్ని సరి చేయించుకుని, వాహనాన్ని తీసుకుని రావాలి.

–ఎండీ. అలీ (రాయల్ ఏజెన్సీ నిర్వాహకుడు)

ఉన్నతాధికారులకు నివేదిస్తాం



నూతనంగా ఎఫ్‌సీల జారీ అంశంలో కార్మికులు సమస్యలను తెలియజేస్తే పరిగణంలోకి తీసుకుంటాం. ఇప్పటి వరకు ప్రైవేట్ ఏజెన్సీకి సంబంధించి ఆర్టీఏ అధికారులు తీసుకోవాల్సిన చర్యలు, తనిఖీల అంశంలో గైడ్‌లైన్స్ రాలేదు. డ్రైవర్లు వారి సమస్యలు చెబితే , ఉన్నతాధికారులకు తెలియజేస్తాం.

– కె. సీతారామిరెడ్డి (డీటీసీ, గుంటూరు జిల్లా)

పవిత్ర రంజాన్ మాసం ఆగమనం

నేటి నుంచి ఉపవాస దీక్షలు ప్రారంభం



విద్యుత్ అలంకరణలో పొన్నూరు పట్టణంలోని మసీదు

పొన్నూరు: సహనం.. ఓపిక.. దైవారాధన.. దాతృత్వం మేళవించిన రంజాన్ పవిత్ర మాసం విచ్చేసింది. శనివారం ఆకాశంలో నెలవంక దర్శనంతో ప్రారంభమైంది. నెలవంకను దర్శించుకున్న ముస్లింలు ముబారక్ అంటూ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా శుభాభివందనాలు తెలుపుకున్నారు. అనంతరం మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

దివ్య ఖురాన్ అవతరించిన మాసం

దివ్య ఖురాన్ ద్వారా మానవాళికి నిర్దేశించిన విధానాలలో ఒకటైన రోజా(ఉపవాసాలు) ఈ మాసంలో 30 రోజులపాటు పాటిస్తారు. సూర్యోదయానికి ముందు నుంచి సూర్యాస్తమయం వరకు రోజాను పాటిస్తారు. 12 ఏళ్ల వయస్సు దాటిన వారి నుంచి వృద్ధుల వరకు ప్రతి ముస్లిం ఉపవాస దీక్ష పాటిస్తారు. తెల్లారకముందే 'సహర్' తో ప్రారంభమైన ఉపవాసం సూర్యాస్తమయం అయ్యాక 'ఇఫ్తార్'తో ముగుస్తుంది. సుమారు 13 నుంచి 14 గంటల పాటు ఆహారం, పండ్లు, ఫలహారాలు, టీ, శీతల పానీయాలు, నీరు, చివరకు ఉమ్మి కూడా మింగకుండా కఠిన దీక్షను పాటిస్తారు. ప్రతి వ్యక్తిలో ఓపిక, సహనం, పేదల ఆకలి దప్పుల బాధ తెలియడం లక్ష్యంగా ఈ ఉపవాసం కొనసాగుతుంది. ఈనెలలోని 26వ రోజు రాత్రి ఖురాన్ అవతరించినట్లు మత పెద్దలు చెబుతుంటారు. ఆ రోజున 'షబ్ ఏ ఖదర్' జరుపుకొంటారు. రాత్రంతా జాగరణతో అల్లా ప్రసన్నానికి ప్రార్థిస్తారు.

ప్రత్యేక 'తరా వీహ్' నమాజు ఆచరణ

ప్రతిరోజూ ఐదు వేళల పాటించే నమాజుతో పాటు రంజాన్ మాసంలో ప్రత్యేకంగా 'తరా విహ్' నమాజును ఆచరిస్తారు. ప్రతిరోజూ రాత్రి ఇషా నమాజు అనంతరం పాటిస్తారు. దివ్యఖురాన్లో 30 భాగాలు ఉండగా, రంజాన్ మాసంలోని ఒక్కో భాగాన్ని ఈ ప్రత్యేక నమాజులో పఠిస్తారు.

దానధర్మాలకు 'జకాత్'

ప్రతి ముస్లిం తన సంపాదనలోని నికర ఆదాయంలో జకాత్ పేరిట పేదలకు దానం చేయడం ఇస్లాం విధివిధానాల్లో ఒక అంశం. నికర ఆదాయంలో నిర్ణయించిన మేరకు దానధర్మాలను పాటించకపోతే నరకం ప్రాప్తిస్తుందంటూ ఇస్లాం హెచ్చరిస్తుంది. దీంతో రంజాన్ మాసంలో ముస్లింలు దానధర్మాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. పేదవర్గాలు కూడా తమతో సమానంగా తినాలని, రంజాన్ పండగ జరుపుకోవాలనే లక్ష్యంతో ఆహార పదార్థాలు, దుస్తులు, ఇతర గృహోపకరణాలను దానం చేస్తుంటారు. రంజాన్ మాసంలో చేసే దాన ధర్మాలకు ఎక్కువ పుణ్య ఫలాలు లభిస్తుండటంతో ఈ మాసాన్ని ఒక వేదికగా తీసుకొని పేదలకు ఆదుకునేందుకు ముందుకు వస్తారు. ఈ నెలలోనే ప్రతి వ్యక్తీ 'ఫిత్రా' పేరిట పేదలకు నగదు లేదా గోధుమలు దానం చేస్తుంటారు.

నెలవంక దర్శనంతో 'ఈదుల్ ఫితర్'

30 రోజుల ఉపవాస దీక్ష అనంతరం కనిపించే నెలవంక దర్శనంతో ఉపవాసాలను నిలిపివేసి మరుసటిరోజు ఈదుల్ ఫితర్(రంజాన్) పండగను ఘనంగా జరుపుకుంటారు.

గుడ్ ఓపెనింగ్

- సజావుగా జూనియర్ ఇంటర్ పరీక్షలు
- మొదటి రోజు ప్రశాంతం
- గుంటూరులోని ఓ పరీక్ష కేంద్రంలో 10 నిమిషాలు ఆలస్యంగా ప్రశ్నపత్రం
- విద్యార్థులకు అదనంగా 10 నిమిషాలు కేటాయింపు
- గుంటూరు జిల్లాలో 87 కేంద్రాల పరిధిలో 34,227 మంది హాజరు
- 35 కేంద్రాల్లో అధికారులు విస్తృత తనిఖీలు



రూంల కేటాయింపును చూసుకుంటున్న విద్యార్థులు



హాల్ టికెట్ల పరిశీలన

గుంటూరు ఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సర విద్యార్థులకు శనివారం పబ్లిక్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ప్రశాంతంగా జరిగాయి. జిల్లా వ్యాప్తంగా 87 కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. ఆర్ట్స్, సైన్స్ కోర్సుల్లో 33,783 మంది విద్యార్థులకు గానూ 33,072 మంది, ఒకేషనల్ కోర్సుల్లో 1,287 మందికి గానూ 1,155 మంది హాజరయ్యారు. నిమిషం ఆలస్యంగా వచ్చినా కేంద్రాల్లోకి అనుమతించబోమని అధికారులు చేసిన హెచ్చరికలతో విద్యార్థులు ఉదయం 8 గంటలకే కేంద్రాలకు చేరుకున్నారు. ఉదయం 8.45 గంటలకు అధికారులు లోపలకు అనుమతించారు. 9 గంటలకు ప్రశ్నపత్రం పంపిణీ చేశారు. మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరిగింది.

దూర ప్రాంతాల్లో కేంద్రాలతో అవస్థలు

గుంటూరు నగరంతో పాటు వివిధ మండలాల పరిధిలో కేటాయించిన పరీక్ష కేంద్రాలు దూరంగా ఉండటంతో విద్యార్థులు అవస్థలు పడ్డారు. ప్రధానంగా గుంటూరు నగరంలో డొంక రోడ్డు మూసివేత కారణంగా ఉదయం 8 గంటల నుంచి విద్యార్థులు ఇరువైపులా పరీక్ష కేంద్రాలకు చేరుకునేందుకు ఒక్కసారిగా రాకపోకలు సాగించడంతో అక్కడ ట్రాఫిక్ స్తంభించింది. సంగడిగుంటకు చెందిన వివిధ ప్రైవేటు కళాశాలల్లోని విద్యార్థులకు ఇన్నర్ రింగ్ రోడ్డులో కేంద్రాలను కేటాయించడంతో, వాటిని చేరుకునేందుకు సరైన మార్గం లేక ఇబ్బందులు పడ్డారు. మూడు నెలలుగా కొనసాగుతున్న డొంక రోడ్డు మూడు వంతెనల మార్గం పరీక్షల సమయానికి కూడా పూర్తి కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పిల్లలను సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేర్చడంలో తల్లిదండ్రులు ఇబ్బందులు పడ్డారు. కాగా సోమవారం సీనియర్ ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి.

పరీక్ష ఆలస్యం

గుంటూరు విద్యానగర్‌లోని మ్యాట్రిక్స్ జూనియర్ కళాశాలలో ఓ రూములో విద్యార్థులకు 10 నిమిషాలు ఆలస్యంగా ప్రశ్నపత్రం ఇచ్చారు. 9.10 గంటలకు ఇవ్వడంతో విద్యార్థులకు అదనంగా ఆ సమయాన్ని కేటాయించారు. విషయం తెలుసుకున్న ఆర్ఐవో జీకే జుబేర్ ప్రశ్నపత్రం జాప్యంపై విచారణ జరిపించారు. మొదటి రోజు కావడంతో కొంత జాప్యం జరిగిందని, దీన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన చెప్పారు. ఇది మినహా ఎటువంటి సంఘటనలు చోటు చేసుకోలేదు. ఫ్లయింగ్ స్క్వాడ్స్ 20 కేంద్రాలను తనిఖీ చేసింది. సిట్టింగ్ స్క్వాడ్స్ ఎనిమిది, ఆర్ఐవో మూడు, ఇతర బృందాలు నాలుగు చొప్పున తనిఖీలు నిర్వహించాయి.

కౌంటింగ్‌లో అప్రమత్తత అవసరం

జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి



శిక్షణలో మాట్లాడుతున్న కలెక్టర్

గుంటూరు వెస్ట్: ఉమ్మడి కృష్ణా–గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ శాసనమండలి ఎన్నికల ఓట్ల లెక్కింపు సమయంలో అధికారులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. స్థానిక ఏసీ కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన శిక్షణలో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజ, జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు, కృష్ణా జిల్లా సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మ, తెనాలి, నూజివీడు సబ్ కలెక్టర్లు సంజనా సింహా, స్మరణ్ రాజ్‌తో కలిసి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ బ్యాలెట్ పేపర్ల లెక్కింపులో ఏకాగ్రతతో, సమర్థంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. చెల్లుబాటు అయ్యే ఓట్లు, చెల్లని ఓట్లకు సంబంధించి ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలపై కౌంటింగ్ సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. కౌంటింగ్ సూపర్‌వైజర్లు, రో ఇన్‌చార్జిలు, నిరంతరం కౌంటింగ్ విధానాన్ని పర్యవేక్షిస్తూ సిబ్బందికి అవసరమైన సూచనలు, సహాయం అందించాలని చెప్పారు. ప్రారంభం నుంచి కౌంటింగ్ ముగిసేవరకు పాటించాల్సిన అన్ని అంశాలు మరిచిపోకూడదని తెలిపారు. పోటీలో ఉన్న అధిక మెజార్టీ వచ్చిన అభ్యర్థుల ఓట్లలో తదుపరి ప్రాధాన్యత ఓట్లను ఇతర అభ్యర్థులకు కేటాయిస్తూ కౌంటింగ్ ప్రక్రియ నిర్వహించాల్సి ఉంటుందని వివరించారు. ఇటీవల ముగిసిన శాసనమండలి ఎన్నికలు 483 పోలింగ్ బూత్‌లలో జరిగాయన్నారు. ఓట్ల లెక్కింపు 28 టేబుల్స్ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ప్రతి టేబుల్‌కు కౌంటింగ్ సిబ్బందితోపాటు, సూపర్‌వైజర్, రో ఇన్‌చార్జి, షిఫ్ట్ ఇన్‌చార్జిలను నియమించామని చెప్పారు ఓట్ల లెక్కింపునకు మూడు షిఫ్ట్‌లలో ఉద్యోగులు పనిచేస్తారని తెలిపారు. బ్యాలెట్ పేపర్లను అత్యంత జాగ్రత్తగా హ్యాండిలింగ్ చేయాలని సూచించారు. ముందుగా సక్రమంగా ట్రేలలో సర్దుకొని కౌంటింగ్ ప్రారంభించాలని తెలిపారు. మరిన్ని అంశాలను కలెక్టర్, అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా సిబ్బందికి తెలియజేశారు. కార్యక్రమంలో డీఆర్వో షేక్ ఖాజావలి, అధికారులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఫైనాన్స్ వేధింపులకు వృద్ధురాలు మృతి



రోజానమ్మ(ఫైల్)

యాజలి(కర్లపాలెం): ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధుల వేధింపులతో మనోవేదనకు గురై ఓ వృద్ధురాలు మృతి చెందిన సంఘటన బాపట్ల జిల్లా కర్లపాలెం మండలం యాజలిలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. యాజలికి చెందిన తూపరి రోజానమ్మ కుమారుడు తూపరి చిన్‌రావు, మనవడు నాని ఇల్లు కట్టుకునేందుకు రేపల్లెలోని ఓ ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో రెండేళ్ల కిందట రుణం తీసుకున్నారు. అప్పటి నుంచి వరుసగా 15నెలల పాటు కిస్తీలు చెల్లించారు. అనంతరం చిన్‌రావు భార్య మరియమ్మ అనారోగ్యానికి గురికావటంతో చెల్లించటం కష్టమైంది. ఐదు నెలలు చెల్లించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధులు గురువారం ఇంటికి వచ్చి నగదు చెల్లించమని కోరారు. తమవద్ద రూ.30వేలు ఉన్నాయని, మిగతావి వచ్చే నెలలో చెల్లిస్తామని చెప్పినా తీసుకోకుండా ఇంటికి సీల్ వేశారు . దీంతో చిన్‌రావు తల్లి రోజానమ్మ మనోవేదనతో అనారోగ్యానికి గురైంది. కుటుంబ సభ్యులు శనివారం ఉదయం బాపట్ల ఏరియా వైద్యశాలకు తీసుకువెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందింది.

వాణిజ్యం
నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శనివారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. **6,000** గరిష్ఠం : రూ. **7,700**

మోడల్ ధర రూ. **7,000**

క్లుప్తంగా

బడ్జెట్‌లో చేనేతకు తీరని అన్యాయం

మంగళగిరి టౌన్ : కూటమి ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో చేనేతలకు తీరని అన్యాయం జరిగిందని ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శివదుర్గారావు, పిల్లలమర్రి బాలకృష్ణ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత బడ్జెట్‌లో కేటాయించిన నిధులు ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టలేదని విమర్శించారు. మరలా అదే పద్ధతిలో అరకొర నిధులు చూపించారని పేర్కొన్నారు. బడ్జెట్‌లో పూర్తిగా నిధులు కేటాయించకపోవడం చూస్తుంటే కూటమి ప్రభుత్వం చేనేతను నిర్వీర్యం చేయాలనే ధోరణి స్పష్టంగా కనిపిస్తోందని విమర్శించారు. అధికారం వస్తే నేతన్న నేస్తం పథకాన్ని ప్రతి చేనేత కార్మికునికి అమలు చేస్తామన్న చంద్రబాబు దాన్ని పూర్తిగా రద్దు చేశారని తెలిపారు. నేత కార్మికులకు ఉచిత కరెంటుకు సంబంధించిన సమాచారం బడ్జెట్‌లో లేదని ఆరోపించారు. జీఎస్టీ రీయింబర్స్‌మెంట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చామని చెప్పిన ముఖ్యమంత్రి, వాటికి సంబంధించిన జీవోలు ఇంతవరకు విడుదల చేయలేదని తెలిపారు. అధికారం కోసం వాగ్దానాలు చేసి, వచ్చిన తరువాత వాటిని విస్మరించారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచన చేసి చేనేతకు రెండు వేల కోట్ల రూపాయలు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు.

లేపాక్షి కళకు గిరిధర్ శోభ

- ఈనెల 7 నుంచి న్యూఢిల్లీలో చిత్రకళా ప్రదర్శన
- 'విండోస్ టు ది గాడ్స్' పేరుతో నిర్వహణ
- తెనాలి చిత్రకళాకారుడు రాయన గిరిధర్ గౌడ్ ప్రతిభ

తెనాలి: విజయనగర చిత్రకళలో లేపాక్షి శైలి ప్రత్యేకమైంది. అందులోని రేఖా విన్యాసం, వర్ణ సమ్మేళనం విశిష్టమైనవి. మరుగున పడిన నాటి లేపాక్షి చిత్రకళా శైలికి కొత్త మాధ్యమాల పోకడలను మేళవిస్తూ, నవ్య ధోరణలను జోడిస్తూ విస్తృతంగా చిత్రీకరిస్తున్నారు ప్రముఖ చిత్రకారుడు రాయన గిరిధర్‌గౌడ్. పురాణ గాథలు, పాత్రలతో లేపాక్షి శైలి చిత్రకళకు పునరుజ్జీవం కల్పిస్తున్నారు. దృక్పథంలోనూ, వ్యక్తీకరణలోనూ తనదైన ప్రత్యేకతతో జాతీయ, అంతర్జాతీయ చిత్రకళా వేదికలపై రాణిస్తున్నారు. తాజాగా 'విండోస్ టు గాడ్స్' పేరుతో థర్డ్ ఎడిషన్ చిత్రాలను న్యూఢిల్లీలో ప్రదర్శించనున్నారు.

55 చిత్రాల ప్రదర్శన

న్యూఢిల్లీలోని ప్రతిష్ఠాత్మక ఆర్ట్ గ్యాలరీ 'బికనీర్ హౌస్'లో ఈనెల ఏడో తేదీ సాయంత్రం చిత్రకళా ప్రదర్శన ఆరంభిస్తారు. 12వ తేదీ వరకు కొనసాగనుంది. భారత ప్రభుత్వ సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలోని సీసీఆర్‌టీ ఆరుదైన 'అవార్డ్ ఆఫ్ ఫెలోషిప్'తో రెండేళ్లపాటు గిరిధర్ అధ్యయనం చేశారు. లేపాక్షి చిత్ర శైలిలో రామాయణంలోని రెండు ముఖ్య పాత్రలైన రాముడు, హనుమంతుడిలోని వేర్వేరు అంశాలను ప్రతిబింబిస్తూ వేసిన వాటితో పాటు మరికొన్నింటిని కలిపి మొత్తం 55 చిత్రాలను ఇందులో ప్రదర్శించనున్నారు.

హైదరాబాద్‌లో 'దశావతార' ప్రదర్శన

దీనికంటే ముందుగా గిరిధర్ గౌడ్ హైదరాబాద్‌లోని కళాకృతి ఆర్ట్ గ్యాలరీ సహకారంతో అక్కడే 'దశావతార' పేరుతో ప్రదర్శన, అదే గ్యాలరీ సౌజన్యంతో న్యూఢిల్లీలో 'కృష్ణలీల' చిత్రకళా ప్రదర్శనను నిర్వహించారు . ప్రస్తుతం జరగనున్న ప్రదర్శనను థర్డ్ ఎడిషన్‌గా ఆయన పేర్కొన్నారు. ఈసారి హైదరాబాద్‌కు చెందిన చిత్రకళాకారుడు సచిన్ జల్తారేతో కలిసి 'చిత్రకళా జుగల్బందీ'గా 'విండోస్ టు ది గాడ్స్' ప్రదర్శనను చేస్తుండటం విశేషం. వాల్మీకి రామాయణాన్ని గిరిధర్ అధ్యయనం చేశారు. రాముని వ్యక్తిత్వం, హనుమ భక్తితత్వం, రామునికి దాసునిగా, భక్తునిగా హనుమ తనకు తాను వ్యక్తపరచుకున్న తీరును చిత్రీకరించినట్టు ఆయన వెల్లడించారు. ఇందులో శాస్త్రీయ పద్ధతిలో కాన్వాసుపై అక్రలిక్ రంగులతో 15 చిత్రాలు, బాంబూ, వార్స్లీ పేపరుపై తీర్చిదిద్దిన 40 మినియేచర్ చిత్రాలున్నాయి. చిత్రశైలిలో భాగంగా కొన్ని మినియేచర్స్ చిత్రాల్లో బంగారం రేకు పూతనూ వినియోగించడం మరో ప్రత్యేకతగా చెప్పారు.


శ్రీరామదాస్య హనుమ


శివ ధనుర్భంగం

తెనాలి గడ్డ ముద్దుబిడ్డ



చిత్రకారుడు గిరిధర్ గౌడ్ స్వస్థలం తెనాలి రూరల్ మండల గ్రామం సంగంజాగర్లమూడి శివారు గరువుపాలెం. మైసూర్‌లో ఫైన్ ఆర్ట్స్‌లో డిగ్రీ చేశారు. బరోడాలో పీజీ చేశాక, అక్కడే సహాయ అధ్యాపకుడిగా పనిచేశారు. వృత్తి జీవితం బాగానే ఉన్నా, తనలోని కళా హృదయానికి సంతృప్తి కరువైంది. స్వస్థలానికి చేరుకుని అక్కడే చిత్రకళా సాధనకు అంకితమయ్యారు. మూడు దశాబ్దాలుగా చిత్రకళలో రకరకాల ప్రయోగాలు చేస్తూ, భావాలకు రంగుల దృశ్య రూపం కల్పిస్తున్నారు. పురాణ గాథలు, ఆధ్యాత్మిక భావాలతో స్ఫూర్తిని పొందిన గిరిధర్...పద్మశ్రీ జగదీష్ మిట్టల్ సూచనలు, 'ట్రెడిషనల్ స్కూల్స్' సమాచారం తీసుకుంటూ మినియేచర్ సహా విస్తృతమైన కాన్వాసుపై తనదైన పంథాలో చిత్ర రచన చేస్తున్నారు. కొన్నేళ్లుగా లేపాక్షి చిత్రకళా శైలి పునరుజ్జీవానికి కృషి చేస్తున్నారు. వీటన్నిటి కలయికతో రూపొందించిన కళాకృతులు ఢిల్లీ సహా దేశంలోని ప్రముఖ నగరాల్లోని ఆర్ట్ గ్యాలరీల్లో ప్రదర్శనకు నోచుకున్నాయి. హైదరాబాద్‌లో ఒకే ఏడాది మూడు వ్యక్తిగత చిత్రకళా ప్రదర్శనలను నిర్వహించిన ఖ్యాతిని గిరిధర్ దక్కించుకున్నారు.

ఔషధ మొక్కలతో పలు ప్రయోజనాలు

జిల్లా అటవీ శాఖాధికారిణి హిమ శైలజ

గుంటూరు ఎడ్యుకేషన్: ఔషధ మొక్కలతో మానవాళికి ఎన్నో ప్రయోజనాలున్నాయని జిల్లా అటవీ శాఖాధికారిణి ఎం. హిమ శైలజ పేర్కొన్నారు. జేకేసీ కళాశాల ఆడిటోరియంలో నిర్వహిస్తున్న ఔషధ మొక్కలు–ఉత్పత్తుల ప్రదర్శన శనివారం ముగిసింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న హిమ శైలజ మాట్లాడుతూ అడవుల్లో పెరిగే మొక్కలు, చెట్లలో దీర్ఘకాలిక జబ్బులు, వ్యాధులను నయం చేసే గుణాలున్నాయని తెలిపారు. గతంలో శ్రీశైలంలో పని చేసిన సమయంలో అక్కడి గిరిజనులు అడవుల్లో వన మూలికలను ఆరోగ్య పరిరక్షణకు ఉపయోగించేవారని వివరించారు. కళాశాల కరస్పాండెంట్ జాగర్లమూడి మురళీమోహన్ మాట్లాడుతూ ఔషధ మొక్కలపై అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన ప్రదర్శన ప్రయోజనం చేకూర్చిందని, 120 రకాల మొక్కలను సేకరించి ప్రదర్శనలో ఉంచినట్లు వివరించారు. పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్సార్కే ప్రసాద్ మాట్లాడుతూ ఔషధ మొక్కలను సేకరించడంలో తమ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పడిన శ్రమను వివరించారు.


వృక్ష విలాపం పోస్టర్లు ఆవిష్కరిస్తున్న హిమ శైలజ తదితరులు

కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. సాంబశివరావు మాట్లాడుతూ నిత్య జీవితంలో ప్రతి ఒక్కరూ ఔషధ మొక్కలను, ఉత్పత్తులను ఉపయోగించుకుని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. చెట్లను నరికివేయడం వల్ల వాటిల్లే నష్టాలను వివరిస్తూ 'వృక్ష విలాపం' పేరుతో రూపొందించిన పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి. గోపీచంద్, పర్యావరణవేత్త చెలికాని సీతారామయ్య, ప్రదర్శన కార్యనిర్వాహక కార్యదర్శులు డాక్టర్ దూనియల్, డాక్టర్ గురవయ్య, అధ్యాపకులు డాక్టర్ సరోజ, శ్రీలత, రోహిత, హారిక, వైష్ణవి, కీర్తి, మల్లీశ్వరి, శ్రావ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

త్వరితగతిన గుంటూరు చానల్ భూసేకరణ

కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

ప్రత్తిపాడు: గుంటూరు చానల్ భూసేకరణ పనులను త్వరితగతిన మొదలు పెట్టనున్నట్లు కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. బడ్జెట్‌లో నిధులు కేటాయించడాన్ని స్వాగతిస్తూ ప్రత్తిపాడులోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద సీఎం చంద్రబాబునాయుడు ఫ్లెక్సీకి శనివారం క్షీరాభిషేకం చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ అన్నదాతల అర్ధ శతాబ్దపు కల అయిన గుంటూరు చానల్‌ను ప్రత్తిపాడు ప్రాంత ప్రజలకు, రైతులకు అందించేందుకు సహకరించిన సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. రానున్న రెండు మూడేళ్లలో పనులు పూర్తి చేసేలా సమర్థులైన కాంట్రాక్టర్లను తీసుకు వస్తామని చెప్పారు. చానల్ ఆధునికీకరణకు కూడా మరో రూ. 600 కోట్లు వచ్చే అవకాశం ఉందని, కొంత ఆలస్యమైనా వాటిని కూడా సాధిస్తామని చెప్పారు.

పలు రోడ్లకు నిధులు మంజూరు

ప్రత్తిపాడు నియోజకవర్గంలో పలు రోడ్ల నిర్మాణానికి గ్రామీణ సడక్ యోజన కింద నిధులు మంజూరైనట్లు కేంద్ర మంత్రి పెమ్మసాని తెలిపారు. ఈదులపాలెం నుంచి పాత మద్రాసు రోడ్డు వరకు రూ. 10.30 కోట్లతో సుమారు ఆరు కిలోమీటర్లు, పెదనందిపాడు ప్రాంతంలో 5.5 కిలోమీటర్ల మేర నిర్మాణానికి రూ. 4.47 కోట్లు, ముట్లూరు నుంచి బురదగుంటపల్లె వరకు రూ. 11.58 కోట్లతో 10.59 కిలోమీటర్ల మేర రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని చెప్పారు. ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ గుంటూరు చానల్ ఆధునికీకరణ ఈ ప్రాంత వాసుల కల అని తెలిపారు. కార్యక్రమంలో మాజీ మంత్రి మాకినేని పెదరత్తయ్య, పార్టీ నాయకులు శివరాం ప్రసాద్ పాల్గొన్నారు.


సీఎం చంద్రబాబు ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న ఎంపీ పెమ్మసాని

కృష్ణా తీరంలో విజుబుల్ పోలీసింగ్

- ప్రేమికులకు, కాలేజీ విద్యార్థులకు కౌన్సెలింగ్
- ప్రకాశం బ్యారేజ్ దాటివస్తే సహించేది లేదంటూ హెచ్చరికలు

తాడేపల్లి రూరల్ : తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని సీతానగరం, పుష్కర ఘాట్లు, రైల్వే బ్రిడ్జి, కృష్ణా తీరంలోని ఇసుక తిన్నెల్లో శనివారం సాయంత్రం తాడేపల్లి పోలీసులు విస్తృతంగా పర్యటించారు. ఇసుక తిన్నెల్లో సేదతీరుతున్న ప్రేమికులకు, విద్యార్థులకు, మందు బాబులకు, ఆకతాయిలకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎస్ఐ ఖాజావలి మాట్లాడుతూ డీఎస్పీ మురళీకృష్ణ, సీఐ కల్యాణ్‌రాజు ఆదేశాల మేరకు తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విజుబుల్ పోలీసింగ్ నిర్వహిస్తున్నామని ఎస్ఐ ఖాజావలి చెప్పారు. ఈ మధ్య కృష్ణాతీరంలో ప్రేమికులతో పాటు కాలేజీ విద్యార్థులు, ఆకతాయిలు సంచరిస్తున్నారని సమాచారం వచ్చిందని తెలిపారు. దీంతో తీరంలో నాలుగు వైపులా విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విజయవాడకు చెందిన పలువురు విద్యార్థులు కాలేజీలు వదిలిన అనంతరం కృష్ణానదీ తీరానికి వస్తున్నారని, వారితో పాటు కొంతమంది ఆకతాయిలు కూడా వచ్చి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారని చెప్పారు. ప్రకాశం బ్యారేజ్ దాటి ఇటువైపు రావడానికి వీల్లేదని, మరోసారి నిషేధిత ప్రాంతాల్లో సంచరిస్తే కేసులు నమోదు చేస్తామని విద్యార్థులను హెచ్చరించినట్లు తెలిపారు.


విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇస్తున్న తాడేపల్లి ఎస్ఐ ఖాజావలి

మిర్చి రైతుల డేటా విధిగా సమర్పించాలి

మార్కెటింగ్ శాఖ ఆర్జేడీ కాకుమాను శ్రీనివాసరావు

కొరిటిపాడు (గుంటూరు): మిర్చి రైతుల డేటాను 2024 డిసెంబర్ 1వ తేదీ నుంచి కమిషన్ వ్యాపారులు సేకరించి సోమవారం లోపు ఇవ్వాలని వ్యవసాయ మార్కెటింగ్ శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు సూచించారు. మిర్చి యార్డు ఆవరణలోని సమావేశ మందిరంలో మిర్చి ఎగుమతి, దిగుమతి వ్యాపారులు, యార్డు అధికారులు, సిబ్బందితో శనివారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌జేడీ కాకుమాను శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతులు విక్రయించిన మిర్చి, ధర, సరుకు విలువ, రైతుల ఆధార్, బ్యాంక్ ఖాతా నెంబర్లను వ్యాపారులు సేకరించి ఇవ్వాలని ఆదేశించారు. ఇంటిగ్రేటెడ్ వేయింగ్ స్కేల్స్‌పై అధ్యయనం చేసేందుకు త్వరలో వ్యాపారులు, అధికారులతో కూడిన బృందాన్ని పంపనున్నట్లు వెల్లడించారు. యార్డులో క్రయ, విక్రయాలకు ఆటంకం కల్పించే తొమ్మిది షాపుల లైసెన్స్‌లను హోల్డ్‌లో పెట్టామని చెప్పారు.


మాట్లాడుతున్న మార్కెటింగ్ శాఖ ఆర్జేడీ

యార్డులో గేట్లకు ఎదురు అడ్డదిడ్డంగా మిర్చి బస్తాలు పెట్టడం, ఆరబోయడం వంటి చర్యలకు పాల్పడితే చర్యలు తప్పవని తెలిపారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా నాలుగో నంబరు గేటును కూడా తెరచినట్లు చెప్పారు. మార్కెట్ కమిటీకి ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. కమీషన్ షాపుల యజమానులు మాట్లాడుతూ ప్రతి రోజు రైతులకు సంబంధించిన డేటా ఇవ్వడానికి ఇబ్బందికరంగా ఉంటుందని, వారం చివరిలో అమ్మకాలలతో పాటు పూర్తి స్థాయి డేటా ఇస్తామని వెల్లడించారు సమావేశంలో మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు బి.రాజబాబు, యార్డు కార్యదర్శి ఎ.చంద్రిక, యార్డు ఇన్‌చార్జి సుబ్రహ్మణ్యం, అసిస్టెంట్ ఇన్‌చార్జి శ్రీకాంత్ పాల్గొన్నారు.

మద్యం మత్తులో నకిలీ పోలీస్ అవతారం


దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగింత

తాడేపల్లి రూరల్ : తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఓ యువకుడు మద్యం మత్తులో నకిలీ పోలీస్ అవతారం ఎత్తాడు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ డబ్బులు వసూలు చేసే కార్యక్రమాన్ని శనివారం చేపట్టాడు. ఎందుకు ఇవ్వాలంటూ ప్రజలు ఎదురు తిరగడంతో బెదిరింపులకు పాల్పడ్డాడు. ఐడీ కార్డు చూపించమంటే దురుసుగా ప్రవర్తించాడు. పోలీస్ అయి ఉండి మద్యం తాగడం ఏమిటని ప్రశ్నించగా, తాగకూడదా ? అంటూ ఎదురు ప్రశ్నవేశాడు. చివరకు అతను నకిలీ పోలీస్ అని గుర్తించి స్థానికులు దేహశుద్ధి చేసి తాడేపల్లి పోలీసులకు అప్పగించారు. జరిగిన ఈ సంఘటనపై తాడేపల్లి పోలీసులు మాట్లాడుతూ సదరు వ్యక్తి పేరు నాగార్జున అని, వడ్డేశ్వరం నివాసి అని తెలిపారు. మద్యం మత్తులో నకిలీ పోలీస్ అవతారం ఎత్తాడని, గతంలో ఇలాంటి సంఘటనలకు ఏమైనా పాల్పడ్డాడా ? అనే విషయాన్ని విచారిస్తున్నట్లు చెప్పారు.


నాగార్జున

ముదిరాజ్ యువసేన జిల్లా అధ్యక్షుడిగా శివ నాగరాజు

ఫిరంగిపురం: ముదిరాజ్ యువసేన గుంటూరు జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని వేములూరిపాడుకు బోళ్ల వెంకట శివనాగరాజు నియమితులయ్యారు. ఈ మేరకు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు నాని ముదిరాజ్ శనివారం ఆయనకు నియామక పత్రం అందజేశారు. నాగరాజు మాట్లాడుతూ ముదిరాజ్ యువకులు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు సహకారం అందిస్తానని చెప్పారు. ముదిరాజ్‌ల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని తెలిపారు.


శివ నాగరాజు

గుంటూరును విద్యా రాజధానిగా తీర్చిదిద్దిన భాష్యం



గుంటూరు ఎడ్యుకేషన్: జేఈఈ, నీట్ వంటి జాతీయస్థాయి పోటీ పరీక్షల్లో వరుసగా అత్యుత్తమ ర్యాంకులను సాధించడం ద్వారా గుంటూరు నగరాన్ని భారతదేశ విద్యా రాజధానిగా భాష్యం రామకృష్ణ తీర్చిదిద్దారని మానవత సేవా సంస్థ విద్యా కమిటీ చైర్మన్ ప్రొఫెసర్ నూతలపాటి అరవింద్ అన్నారు. భాష్యం రామకృష్ణ పుట్టినరోజు సందర్భంగా శనివారం చంద్రమౌళీనగర్‌లోని మెయిన్ క్యాంపస్‌లో ఆయన్ను కలిసి అభినందనలు తెలియజేశారు. అరవింద్ మాట్లాడుతూ వేలాది మంది విద్యార్థులకు అత్యుత్తమమైన విద్యను అందించడంతో పాటు సామాజిక సేవలో సైతం భాష్యం రామకృష్ణ పాలు పంచుకుంటున్నారని పేర్కొన్నారు. వరదలు, తుపానులు వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన సమయంలో విద్యాసంస్థల ద్వారా ప్రజలకు సహాయపడటంలో ముందు వరుసలో ఉన్నారని తెలిపారు. మానవతా సంస్థ చైర్మన్ పావులూరి రమేష్, నగర అధ్యక్ష, కార్యదర్శులు కొమ్మాలపాటి శ్రీధర్, సతీష్, యునైటెడ్ వాకర్స్, సెంటర్ ఫర్ సోషల్ సైకాలజీ, తెలుగు రైతు సంస్థలకు చెందిన ప్రతినిధులు డాక్టర్ నిమ్మల శేషయ్య, ప్రొఫెసర్ వైవీ రెడ్డి, చావా శివాజీ, లక్ష్మి, సాయిరాం, తెలుగు రైతు నాయకులు తాతిరెడ్డి లక్ష్మారెడ్డి తదితరులు భాష్యం రామకృష్ణను అభినందించారు.

నేడు పెనుగొండకు ఆత్మీయ సత్కారం

గుంటూరు రూరల్: జిల్లా గర్వించదగ్గ ప్రముఖ రచయిత, అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణకు కేంద్ర ప్రభుత్వం సమున్నత కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు ప్రకటించటం సంతోషకరమని పార్లమెంట్ మాజీ సభ్యుడు మోదుగుల వేణుగోపాలరెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం అమరావతిరోడ్డులోని ఇన్నర్ రింగ్‌రోడ్డు వైఎస్సార్ విగ్రహం వద్ద గల తనుబుద్ధి బసవిరెడ్డినగర్ శ్రీరామ ధామం సమావేశ మందిరంలో పెనుగొండను సత్కరిస్తున్నట్లు తెలిపారు సభాధ్యక్షులుగా ముప్పా చిన్నబాపిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్ట్ ఎంవీ రామిరెడ్డి వ్యవహరిస్తారని, ఆత్మీయ అతిథులుగా తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ అధ్యక్షులు జూలూరి గౌరీశంకర్, అరసం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జీఎస్ చలం, ప్రముఖ రచయిత సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి, ప్రొఫెసర్ సీహెచ్. సుశీలమ్మ, అరసం ప్రధాన కార్యదర్శి వల్లూరి శివప్రసాద్ పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నగరంలోని రచయితలు, సాహితీవేత్తలు పాల్గొని విజయవంతం చేయాలని మోదుగుల కోరారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

అమరావతి: మండలంలోని మండెపూడి గ్రామ పరిధిలో శనివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మరణించాడు. పోలీసుల కథనం ప్రకారం.. శనివారం మధ్యాహ్నం 75 త్యాళ్లూరు నుంచి గుంటూరు వెళ్తున్న ఏపీఎస్ ఆర్టీసీ బస్ మండెపూడి గ్రామం వద్ద రోడ్డు దాటుతున్న పల్లెపోగు వెంకటేశ్వరరావు (70)ను ప్రమాదవశాత్తు ఢీకొట్టింది. ఘటనలో అక్కడికక్కడే మరణించాడు. అమరావతి పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వెంకటేశ్వరరావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అమరావతి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.